శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో జయహో భారత్ వేడుకలు



విశాలాంధ్ర - పాయకరావుపేట: చంద్రయాన్ 3 ప్రయోగం విజయవంతమైన సందర్భంగా శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులు జయహో భారత్ అంటూ భారీ ప్రదర్శన చేశారు. జాతీయ జెండాను చేతబూని మానవహారాన్ని నిర్వహించారు. ప్రపంచ పటంలో సగర్వంగా తలెత్తి నిలిచిన భారత్ ఘనతను కొనియాడుతూ జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సురేష్, రీజనల్ ఇన్చార్జ్ గోపీనాథ్, ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు, అకాడమిక్ కోఆర్డినేటర్ వెంకటరమణ, డీన్ విజయ్, ఏవో విజయ్, గౌరీ, వేణు ప్రియ, కల్పన పాల్గొన్నారు.

మన్య ప్రగతి ట్రస్టు ఉదారత



విశాలాంధ్ర - పెదబయలు: అరకు నియోజకవర్గం పెద బయలు మండలం రూడకోట పంచాయతీ పెద లోవ గ్రామానికి చెందిన ముఖి కృష్ణారావు (26) అనే ఆదివాసి గిరిజన యువకుడు గత కొన్ని సంవత్సరాల నుండి కంచరపాలెం ప్రాంతంలో అద్దె భవనంలో నివాసం వుంటూ విశాఖ షాపింగ్ మాల్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తూ ఉండేవాడు. ఐతే వ్యక్తిగత కారణాల వలన గురువారం తను నివాసం ఉంటున్న అద్దె భవనంలో ఆత్మహత్య చేసుకొని మరణించాడు. మరణ అనంతరం స్థానిక పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్ ఆసుపత్రికి శవపరీక్ష నిమిత్తం తరలించారు. ఈ సమాచారం తెలుసు కొన్న అరకు నియోజకవర్గం శాసనసభ్యులు చెట్టి ఫాల్గుణ ఆదేశాల మేరకు రూడకోట సర్పంచ్ కాంతరి సురేష్‌తో పాటు మన్యప్రగతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చెట్టి వికాష్‌లు విశాఖ వెళ్లి కృష్ణారావు దహన సంస్కరణల నిమిత్తం 10 వేల రూపాయలు అందించారు.

ఎట్టకేలకు కాలువల నిర్మాణానికి మోక్షం



విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం బంటుపల్లి వారి గ్రామ పంచాయతీ పరిధి సచివాలయం అతి దగ్గరలో ఉన్న కాలువ నిర్మాణానికి మోక్షం లభించింది. శుక్రవారం అధికారులు, నాయకులు సమక్షంలో శంకుస్థాపన చేశారు. 120 మీటర్ల దూరానికి కాలువలు వేయనున్నట్లు అధికారులు తెలిపారు. 10 లక్షలు రూపాయల వ్యయంతో వీటిని నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు కోరాడ అచ్యుత సాధు రాంబాబు, సచివాలయాల కన్వీనర్ కోన శ్రీనివాసరావు, బీపీ కల్లాలు ఉప సర్పంచ్ చందక అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి గంగాధర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మోహన్, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

టేకు దొంగలు స్వాధీనం

విశాలాంధ్ర - గొలుగొండ: కొయ్యూరు మండలం కంఠవరం గ్రామ సమీపంలో 20 టేకు దుంగలను గొలుగొండ సెక్షన్ అటవీ శాఖ అధికారి లక్ష్మణ ఆధ్వర్యంలో శుక్రవారం తమ సిబ్బందితో దాడి చేసి స్వాధీనం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ టేకు దుంగలపై అధికారులు గ్రామంలో విచారణ చేపట్టగా కలప నిల్వ చేసిన వ్యక్తులు వివరాలు తెలియకపోవడంతో, ప్రత్యేక వాహనంలో 20 టేకు దుంగలను గొలుగొండ అటవీశాఖ డిపో కార్యాలయానికి తరలించామన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి



విశాలాంధ్ర - దుంబ్రిగుడ: కొల్లాపూటు పంచాయితీ పరిధి కరకవలస గ్రామంలో సరైన రోడ్డు సౌకర్యం లేక ఆయా గ్రామ గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సేవలు పొందాలన్నా, నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలన్నా రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో మట్టి రోడ్డు మంజూరు నిమిత్తం అల్లూరి జిల్లా, పాడేరు ఐటీడీఏలో స్పందన కార్యక్రమంలో కూడా స్థానిక సర్పంచ్ పి.రామ్మూర్తి ద్వారా విన్నవించడం జరిగిందని గ్రామస్తులు అన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే దృష్టి సారించి గ్రామంలో మట్టి రోడ్డు మంజూరు చేసి తమ కష్టాలు తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పాడిగేదెలు మృతి

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండల పరిధిలో గల సుజనకోట పంచాయతీ తలాబుతోట మోడల్ కాలనీలో లక్ష రూపాయలు విలువ చేసే మూడు గేదెలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురై మృతి చెందాయి. తమర్బ లక్ష్మణ్‌కు చెందిన మూడు దుక్కి గేదెలు శుక్రవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన మృతి చెందినట్లు పంచాయతీ సర్పంచ్ వెంగడ రమేష్ తెలిపారు. నష్ట పరిహారం వచ్చేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. సర్పంచ్‌తోపాటు మాజీ వైస్ సర్పంచ్ లైకొన్, వాలంటీర్ ధనుంజయ్ పాల్గొన్నారు.

మంత్రి అమర్నాథ్ సమక్షంలో 'గంగవరం' కార్మికుల చర్చలు



విశాలాంధ్ర - పెదగంట్యాడ: సుమారు 54 రోజులుగా గంగవరం పోర్ట్ కార్మికులు జరుపుతున్న ఆందోళనకు ముగింపు పలకాలన్న ఉద్దేశంతో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం పోర్టు కార్మికులతో చర్చలు జరిగాయి. ఇప్పటికే కార్మికులు చేస్తున్న వివిధ డిమాండ్లలో కొన్నింటిని పోర్టు యాజమాన్యం అంగీకరించింది. మరికొన్ని ప్రధాన డిమాండ్ల సాధన కోసం కార్మికులు మంత్రి అమర్నాథ్ వద్దకు వచ్చారు. ముఖ్యంగా ఇంక్రిమెంట్ పెంపుదల విషయంలో కార్మికులకు, యాజమాన్యానికి మధ్య ఒక స్పష్టమైన ఒప్పందం కుదరాల్సి ఉంది. అలాగే పోర్టును షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ కింద కాకుండా ఫ్యాక్టరీ యాక్ట్ కిందకు తీసుకురావాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ కార్మికులను నష్ట పోకుండా డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. శనివారం సాయంత్రం మరోసారి కార్మికులు, కార్మిక సంఘ నాయకులు తదితరులతో సమావేశమై ఈ సమస్యను కొలిక్కి తీసుకురానున్నట్లు మంత్రి అమర్నాథ్ తెలియజేశారు. ఈ సమావేశంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, ఏఐటీయూసీ నేత డి.ఆదినారాయణ, ఐ ఎన్ టి యూ సీ నేత మంత్రి రాజశేఖర్, పులి వెంకటరమణారెడ్డి, శ్రీనివాసరావు, సీపీఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, పలువురు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాల ద్వారానే ఉక్కు పరిరక్షణ

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: పోరాటాల ద్వారానే ఉక్కు పరిరక్షణ సాధ్యమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న రిలే దీక్షలు శుక్రవారానికి 925 రోజులకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో ఎం.ఎం.ఎస్.ఎం, ఎస్.టి.ఎం విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు విషయంలో మొండి వైఖరి అవలంబిస్తోందని అన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన ఉక్కు కర్మాగారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేట్ పరం కానివ్వమని అన్నారు. ఈ దీక్షల్లో కార్మిక సంఘాలు నేతలు, ఉద్యోగులు డి.సంపూర్ణం, గుమ్మడి నరేంద్ర, డి.దేముడు, జి.ఆనంద్, ఎం.కె.వి.రాజేశ్వరరావు, మహ్మద్, నమ్మి సింహాద్రి, పి.వి.సాగర్, కృష్ణం నాయుడు, డి.రమేష్, టి.ఎం.మోహన్ కుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - కె.కోటపాడు: స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులకు వినతి పత్రాలను అందజేయడం జరుగుతుందని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి వనము సూర్యనారాయణ తెలిపారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల 28వ తేదీ నుండి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అక్కడ సమస్యలపై సెప్టెంబర్ ఒకటో తేదీన గ్రామ సచివాలయాల వద్ద వినతి పత్రాలు అందిస్తామన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, నిత్యవసర ధరలు అరికట్టాలని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, స్వామినాథన్ సిఫార్సుల మేరకు పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని వినతి అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గండి నాయన బాబు, ఎర్ర దేవుడు, దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.



పంట పొలాల పరిశీలన

విశాలాంధ్ర - భీమిలి: మండలంలోని తర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయం పొలాలు రైతులతో సందర్శించడానికి నాబార్డ్ డీజీఎం, ఏజీఎంఎ, నేపాల్ బృందంతో పాటు 17 రాష్ట్రాల బృందం జీపీ జెడ్ బృందం రైతు సాధికార సంస్థ అధికారి ప్రకాష్, తదితరులు సందర్శించారు. ప్రకృతి వ్యవసాయంపై జరుగు మేలు, వాటి ఉపయోగాలు ఆవశ్యకతల గురించి ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, తర్లువాడ సర్పంచ్ బిఆర్బి నాయుడు, జిల్లా ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ప్రాజెక్ట్ మనేజర్ మోహన్‌రావు పాల్గొన్నారు.

సాయినాధున్ని దర్శించుకున్న ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర - కశింకోట: మండలంలో పల్లపు సోమవరం గ్రామంలో శ్రీ షిర్డీ సాయినాథ్ ఆలయ 10వ వార్షికోత్సవం సందర్భంగా మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ చిరంజీవి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి గొంతిని శ్రీనివాసరావు అతిధులను ఘనంగా సత్కరించి మెమోంటో అందజేశారు. 10వేల మందికి అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఉగ్గిన రమణ మూర్తి, సిదిరెడ్డి శ్రీను, వేగి గోపికృష్ణ, పెంటకోట రాము, నైనం శెట్టి రమణ తదితరులు పాల్గొన్నారు.

వాయుసేనలో వాయిద్యకారుల ఎంపిక

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: సెప్టెంబర్ 15, 16 తేదీలలో సికింద్రాబాద్ బేగంపేట లో భారత వాయుసేనలో ఎయిర్ మన్ సెలక్షన్ సెంటర్లో అగ్నిపథ్ వాయు-వాయిద్యకారుల ఎంపిక నిర్వహిస్తున్నట్లు రిక్రూట్మెంట్ అధికారి, కమాండింగ్ ఆఫీసర్ గురుప్రీత్ అత్వాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, లక్షద్వీప్, పాండిచ్చేరి ప్రాంతాల వారు పాల్గొనవచ్చు అన్నారు. అభ్యర్థులు శరీర దారుఢ్యం కలిగి, ఫ్లూట్, క్లారినెట్, సాక్సోఫోన్, కీబోర్డు, ఆర్గాన్, పియానో, గిటార్, వయోలిన్, క్లాసికల్ ఇనుస్ట్రుమెంట్ మొదలైన వాటిలో డిప్లమా లేదా డిగ్రీ కలిగి ఉండాలన్నారు. 162 సీఎం.మీ. పొడవు, పొడవుకు తగిన బరువు, ఛాతి 5 సెం.మీ. విస్తరించగలగాలని స్పష్టమైన కనుచూపు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు https:// agnipathvayu.cdac.in/AV వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

మండలంలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలంలో జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి శుక్రవారం ఆకస్మికంగా పర్యటించారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం సురవరం కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వసతి సౌకర్యాలు, ఆరోగ్య పరిస్థితులు, విద్యా విధానాలు, వసతి గృహ పనితీరు, ఉపాధ్యాయులు బోధన తీరు తదితర విషయాలు గురించి సమీక్షించి విద్యార్థులు, ఉపాధ్యాయులతోను మాట్లాడారు. ఆయన వెంట తహశీల్దార్ పివి.రత్నం, ఎంపిడిఓ మీనాకుమారి, ఎంఇఓ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అగనంపూడి టోల్‌గేటును తక్షణమే తొలగించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి పైడిరాజు



విశాలాంధ్ర - విశాఖ: అగనంపూడి టోల్ గేట్‌ను తక్షణమే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషన్‌లకు సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మెయిల్ ద్వారా వినతిపత్రం పంపారు. కాలపరిమితి ముగిసినా టోల్ గేట్ ను తొలగించకుండా ప్రజల నుండి, వాహనదారులను నుండి టోల్ ఫీజులు వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. ఆనందపురం - సబ్బవరం - అనకాపల్లి ఆరు లైన్ల రోడ్డు నిర్మాణం పూర్తి అయిన వెంటనే ఆగనంపూడి టోల్ గేట్ తొలగిస్తామని సుప్రీం కోర్టుకు నేషనల్ హైవే అధికారులు తెలిపి కూడా నిబంధనలు ఉల్లంఘించారని అన్నారు. జీవీఎంసీ పరిధిలో టోల్ గేట్ ఉండకూడదని ఏడాది క్రితమే జీవీఎంసీ ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని, వెంటనే టోల్ గేట్ తొలగింపునకు అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.

జర్నలిస్టుల జోలికొస్తే ఖబడ్దార్: సీపీఐ

విశాలాంధ్ర - పెందుర్తి: ప్రజా సమస్యలు పరిష్కారం కోసం, సమాజాన్ని చైతన్యపరిచే వాస్తవ జర్నలిస్టుల జోలికొస్తే ఊరుకోబోమని వారిని బెదిరించే రౌడీ మూకలకు ఖబడ్దార్ అంటూ సీపీఐ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు వై.రాంబాబు హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అధికార వైసీపీ నాయకులు ప్రశ్నించే మీడియా సంస్థలు, జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు అజెండాగా మార్చుకున్నారని విమర్శించారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం విశాలాంధ్ర విలేకరి పల్లి వెంకటరమణపై అధికార పార్టీకి చెందిన పెదముసిడివాడ సర్పంచ్ కొడుకు పల్లా అప్పారావు, అతని అనుచరులు దాడి చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఉదయం పెందుర్తి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ సర్పంచ్ భూ ఆక్రమణలపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఘటనపై బాధితుడు పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేస్తే తిరిగి వైసీపీ నాయకులు విలేకరిపైనే అక్రమ కేసులు పెట్టి బెదిరింపులు చేయటం తగదన్నారు. ఈ విషయంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ జోక్యం చేసుకొని నిందితుని చేత విలేకరికి క్షమాపణ చెప్పించాలని డిమాండ్ చేశారు.

అంగన్వాడీలకు ఎండీయూల ద్వారా సరుకులు



విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల ద్వారా అంగన్వాడీ కేంద్రాలకు నిర్దిష్టమైన గడువులోగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, రెవెన్యూ అధికారులు, ఐసీడీఎస్ అధికారులతో ఓటరు నమోదు, నిత్యావసర సరుకులు పంపిణీ తదితరాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. అంగన్వాడీ సరుకుల ఓపెనింగ్ బ్యాలెన్స్ సక్రమంగా ఉండాలన్నారు. డీలర్లు సరుకుల పంపిణీలో జాప్యం చేస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఇంటింటి ఓటరు నమోదు సర్వే పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. ఫారం 6, ఫారం 7, ఫారం 8 సేకరణ సక్రమంగా చేయాలని చెప్పారు. అర్హత కలిగిన రైతులకు పి.ఎం.కిసాన్, రైతు భరోసా అందించాలని స్పష్టం చేసారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాసు, ఐటీడీఏ పీఓ వి.అభిషేక్, రంపచోడవరం ఐటీడీఏ పీఓ సూరజ్ గనోరే, డీఆర్ఓ పి.అంబేద్కర్, ఏడీ సర్వే వై.మోహనరావు, జిల్లా వ్యవయాధికారి ఎస్.బి.ఎస్.నంద్, కలక్టరేట్ పరిపాలనాధికారి చిన్ని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌పై దుష్ప్రచారం మానుకోవాలి

టీడీపీ నేత ప్రగడ నాగేశ్వరరావు

విశాలాంధ్ర - యలమంచిలి: యలమంచిలిలో ఎన్నారై టీడీపీ ఉమెన్స్ వింగ్ వారి సహకారంతో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ అన్న క్యాంటీన్‌పై దుష్ప్రచారం మానుకోవాలని యలమంచిలి టీడీపీ సమన్వయకర్త ప్రగడ నాగేశ్వరరావు కోరారు. టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నా క్యాంటీన్ నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ సరిగా చేయకపోవడం వల్ల గత వారం రోజుల బట్టి అన్న క్యాంటీన్ నిలిపివేయవలసి వచ్చిందని, మరల వచ్చే వారంలో, వేరే కాంట్రాక్టర్ మారుస్తున్నామని, పేదలందరికీ అందుబాటులో అన్న క్యాంటీన్ కొనసాగుతుందని ఆయన చెప్పారు. ఈ అన్నా క్యాంటీన్‌పై దుష్ప్రచారం సొంత పార్టీ నేతలే చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఓటర్ వెరిఫికేషన్‌ను బీఎల్‌ఓలు కక్ష పూర్వకంగా చేస్తున్నారని, అధికార పార్టీ నేతలు చెప్పినట్లు ఓట్లు తొలగిస్తున్నారని వారి దృష్టికి వచ్చిందని, ఆ విధంగా చేసినట్లయితే రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. సమావేశంలో టౌన్ టీడీపీ పార్టీ అధ్యక్షులు గొర్లే నానాజీ, సెక్రటరీ ఆడారి రమణబాబు, జిల్లా టీడీపీ కార్యవర్గ సభ్యులు రాజాన సూర్య నాగేశ్వరరావు, నియోజవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కొఠారి సాంబా, క్లస్టర్ ఇన్‌చార్జిలు ఆడారి ఆది మూర్తి, బొద్దపు శ్రీను (రమణ) పాల్గొన్నారు.



మత్స్యకారులకు న్యాయం చేయండి

విశాలాంధ్ర - నక్కపల్లి: బాపట్ల జిల్లా రామాపురం గ్రామంలో 160 మంది మత్స్యకారులపై అన్యాయంగా కేసులు నమోదు చేసి వారిని నానా ఇబ్బందులకు గురిచేసారని, వారికి న్యాయం చేయాలని కోరుతూ జాతీయ మత్స్యకార సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక నూకాలమ్మ గుడి వద్ద మత్స్యకారులు సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా మత్స్యకారులు నాయకులు మాట్లాడుతూ రామాపురం మత్స్యకారులపై అక్రమ కేసులు బనాయించి, మహిళలు అని చూడకుండా వారిపై పోలీసులు ప్రవర్తించిన తీరు చాలా బాధకారన్నారు. ఈ సమావేశంలో జాతీయ మత్స్యకార సంఘం జిల్లా నాయకులు కొవిరి వెంకటేష్, గరికిన సింహాద్రి, పిక్కి కోదండరావు, పేర్ల శ్రీను, వాసుపల్లి శివ, సిరిపల్లి అప్పలరాజు, వాసుపల్లి రాము, కారే తాతాజీ, కంబాల అమ్మోరియ్య, కొడ చిట్టిబాబు పాల్గొన్నారు.



ఏఐటీయూసీ ప్యానల్‌ను గెలిపించండి



విశాలాంధ్ర - విశాఖ: ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, కార్మిక సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో, అంకితభావంతో పనిచేసే ఏఐటీయూసీ ప్యానల్‌ను గెలిపించాలని బీహెచ్ పీవీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.వి.ఎన్.రాజు కోరారు. బీహెచ్ఈఎల్ ఉద్యోగుల గుర్తింపు యూనియన్ ఎన్నికల్లో బిహెచ్‌పివి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) యునైటెడ్ ప్యానెల్ కార్యకర్తలు శుక్రవారం బీహెచ్ పీవీ ప్రధాన కార్యాలయం నుండి నగరంలోని జిల్లా పరిషత్ వద్ద ఉన్న కేంద్ర లేబర్ కమిషనర్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, కమిషనర్ మహంతికి నామినేషన్ పత్రాలు అందజేసారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా ఐఎన్‌టియుసి, సిఐటియు నాయకులు చేసిన తప్పుడు ఒప్పందాలను రద్దు చేస్తామని చెప్పారు. ఎత్తివేసిన సబ్సిడీల పునరుద్ధరణ కోసం, టౌన్ షిప్ మెయింటెనెన్స్ కోసం ఏఐటీయూసీ ప్యానల్‌కి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, బిహెచ్ఈఎల్ యునైటెడ్ ఫ్రంట్ ప్యానెల్ నాయకులు శోభాకర్ సాహు, బొండా బాబురావు, కొల్లి దేవుడు, ఎ.నర్సింగరావు, జే.రాము, వీరబాబు, భాష, ఎ.వెంకటరావు, టెక్కలి భాస్కరరావు, శ్యాం ప్రసాద్, వారణాసి గోవిందు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ తూర్పు వైసీపీ సమన్వయకర్తగా ఎంపీ ఎంవీవీ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న ఎంవివి సత్యనారాయణను విశాఖ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా వైసిపి అధిష్టానం నియమించింది. గత కొద్దిరోజులుగా ఎంవీవి ను విశాఖ తూర్పు కు కేటాయిస్తారన్న ప్రచారానికి ఆ పార్టీ తెరదించింది. విశాఖ తూర్పు స్థానాన్ని రానున్న 2024లో దక్కించుకోవాలన్న సంకల్పంతో ఎంవివిని నియోజకవర్గం సమన్వయకర్తగా నియమించి ఇప్పటినుంచే నియోజకవర్గంలో పట్టు కోసం ప్రయత్నాలు మొదలు పెట్టాలా పార్టీ క్యాడర్ కు సంకేతాలు పంపింది. విశాఖ తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే టిడిపి నుండి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు హ్యాట్రిక్ కొట్టి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. గతంలో వైసిపి నుండి అక్రమాని, విజయనిర్మల, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయితే ఈసారి కూడా యాదవులకే విశాఖ తూర్పు సీటు కేటా ఇస్తామని ఆది నుంచి హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్ చివరి నిమిషంలో ఎంపీని విశాఖ తూర్పు సమన్వయకర్తగా నియమించడంపై యాదవ సామాజిక వర్గంలో తీవ్ర అసంతృప్తి జ్వాలలు మొదలైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే విశాఖ తూర్పు నుంచి వైసీపీ టికెట్ కోసం అటు అక్రమాని విజయనిర్మల, ఎమ్మెల్సీగా ఉన్న వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, మేయర్‌గా ఉన్న గొలగాని హరి వెంకట కుమారితో పాటు మరి కొంత మంది రేసులో ఉన్నప్పటికీ వెలగపూడిని ఢీకొట్టే అదే సామాజిక వర్గానికి చెందిన ఎంపీ ఎంవివి సత్యనారాయణను దింపినట్లు తెలుస్తుంది.

సీఎంకి ఘన స్వాగతం



విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్/ గోపాలపట్నం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి విజయనగరం జిల్లా చినమేడపల్లి గ్రామంలో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా పాల్గొనేందుకు శుక్రవారం ఉదయం ప్రత్యేక విమానంలో విజయవాడ నుండి విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మాత్యులు బూడి ముత్యాల నాయుడు, మంత్రి గుడివాడ అమర్నాథ్, టీటీడీ మాజీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, బి.సత్యవతి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, డీసీసీబీ చైర్మన్ కోలా గురువులు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తదితరులు స్వాగతం పలికారు. అలాగే కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌కు సీఎం పుష్పగుచ్ఛం ఇచ్చారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - అనంతగిరి: మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఏవీవీ కుమార్ తెలిపారు. ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశమునకు ప్రజాప్రతినిధులు అన్ని శాఖల అధికారులు నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

వైభవంగా కుంకుమార్చన



విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీవరహాలక్ష్మీనృసింహ స్వామివారి దేవస్థానంలో సింహవల్లి తాయారు సన్నిధి, అనుబంధ దేవాలయం ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి అలయంలో అమ్మవారికి కుంకుమార్చన జరిగింది. శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు, అమ్మలగన్న అమ్మ మూలపుటమ్మ అమ్మవారిని భక్తితో ఆరాధిస్తూ కుంకుమార్చన నిర్వహించారు.

నీట్ విద్యార్థులకు గీతం బంపరాఫర్

విశాలాంధ్ర - మధురవాడ: దేశంలో తొలి సారిగా ప్రతభను ప్రోత్సహించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఎంబిబిఎస్‌లో ప్రవేశం పొందే వారికి బంపర్‌ఆఫర్‌ను ప్రకటించింది. నీట్‌లో ర్యాంక్ సాధించిన వారికి భారీగా ఫీజులో రాయితీ ప్రకటించింది. వైద్య కళాశాలలో పేమెంట్ సీటుగా దాదాపు కోటి రూపాయలు ఫీజు నిర్ణయిస్తుండగా ఆశ్చర్యం కలిగించే విధంగా రివర్స్‌లో గీతం ఫీజు తగ్గించడం విశేషం. జిమ్‌సర్ వైద్య కళాశాల ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రో వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ బి.గీతాంజలి వివరాలను వెల్లడించారు. నీట్ ర్యాంకర్లలో ఒక లక్ష 50 వేల లోపు ర్యాంక్ సాధించిన వారికి 50 శాతం మేర ఫీజులో రాయితీని స్కాలర్‌షిప్ రూపంలో తగ్గించనున్నట్లు వెల్లడించారు. అలాగే 3 లక్షల లోపు ర్యాంకు సాధించిన వారికి 25 శాతం ఫీజు రాయితి, 4 లక్షల 50 వేల లోపు ర్యాంకు సాధించిన వారికి 15 శాతం ఫీజు రాయితి, 6 లక్షల లోపు ర్యాంకు సాధించిన వారికి 10 శాతం ఫీజు రాయితి ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిమ్‌సర్ డీన్ డాక్టర్ ఎస్‌పిరావు, జిమ్‌సర్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి పద్మజ పాల్గొన్నారు.

VMRDA విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ

పత్రికా ప్రకటన

VMRDA-LAYOUT/APDPMS No. 1167/0046/LP/VMRDA/2022, తేది. 19-08-2023

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునదేమనగా విజయనగరం జిల్లా, బొండపల్లి మండలం, గొట్లం గ్రామం నందలి ఎకరములు 5.5983 సెంట్లు, సర్వే నెంబరు 97-3 పార్ట్‌లో గల భూమిని లేఔట్ అనుమతి నిమిత్తము శ్రీ బంగారు విజయకుమార్ మరియు చందక పరశురామ్, దరఖాస్తు చేసియున్నారు. సదరు దరఖాస్తు ఈ కార్యాలయం అన్‌లైన్ ఫైల్ VMRDA-LAYOUT/APDPMS No. 1167/0046/LP/VMRDA/2022 నందు పరిశీలన నిమిత్తమైయున్నది.

కావున పైన తెలిపిన లేఔట్ అనుమతి నిమిత్తమై ఎవరికైనను అభ్యంతరములు / సలహాలు కలిగియున్న యెడల ఈ ప్రకటన జారీచేసిన తేదీ నుండి 7 రోజులలోపు వి.ఎం.ఆర్.డి.ఏ కార్యాలయమునకు వ్రాతపూర్వకముగా తెలియజేయవలెను. లేని యెడల ఎట్టి అభ్యంతరములు / సలహాలు లేవని భావించి సదరు దరఖాస్తుపై తదుపరి చర్య తీసుకొనబడునని తెలియచేయుటమైనది.

సం/- మెట్రోపాలిటన్ కమీషనర్, వి.ఎం.ఆర్.డి.ఏ

స్వీయ వాంగ్మూలం

నేను అనగా కోడేటి పోశమ్మ వయసు 53 సంవత్సరాలు. నేను అల్లూరి సీతారామరాజు జిల్లా, దేవీ పట్నం మండలం, చిన రమణయ్య పేట పంచాయితీ చిన రమణయ్య పేట గ్రామ కాపురస్తురాలును. నాకు చెందిన ఆధార్ కార్డు నందు ఆధార్ నెంబర్ 237708961146లోనూ, రేషన్ కార్డు నెంబర్ డబ్ల్యు ఏపీ 041401300628 నందు కోడేటి పోశమ్మ భర్త సోమలింగం అనియు, ఎల్ఐసి పాలసీ బాండ్ నెంబర్ 805226059 లో కొమరం పోశమ్మ భర్త శ్రీరాములు అని నమోదు కాబడి ఉన్నది. సదరు రెండు పేర్లు గల ఆసామీరాలు ను నేను ఒక్కరినే అయి ఉన్నాను. నా ఎల్ ఐ సి పాలసీ ప్రీమియం నగదు గోకవరం ఎల్ఐసి నుండి తిరిగి తీసుకొనేందుకు పేరు మార్పుల వలన ఎవ్వరికైనా అభ్యంతరములు ఉన్న యెడల గోకవరం ఎల్ఐసి బ్రాంచ్ వారికి తెలియపర్చవలసిందిగా ఈ ప్రకటన ద్వారా కోరుచున్నాను.

ఇట్లు

కోడేటి పోశమ్మ అలియాస్ కొమరం పోశమ్మ

SOUTH INDIAN Bank

డోర్ నం.11-4-2/63, సింహాద్రి స్క్వేర్, కణితి రోడ్, గాజువాక, విశాఖపట్నం, ఏపీ. 530026.

Email Id – br0959@sib.co.in

బ్యాంకులో తనఖా పెట్టిన బంగారు ఆభరణాల వేలం

బ్యాంకు నుండి పొందిన బంగారు రుణాలు చెల్లించవలసిందిగా పిలుపునిస్తూ ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలకు సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్ అధీకృత అధికారి ద్వారా నోటీసు(లు) జారీ చేయబడినది. రుణ మొత్తాలను చెల్లించడంలో రుణగ్రహీతలు విఫలమైనందున ఖాతాల్లో ఉన్న బంగారు ఆభరణాలను "ఉన్నది ఉన్నట్లు ప్రాతిపదిక" & "ఏది ఉంటే అది ప్రాతిపదిక" & "రికోర్స్ లేని ప్రాతిపదిక" పై [illegible] ఆన్‌లైన్ వేలం నిర్వహిస్తున్నట్లు ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది. క్రింద పేర్కొన్న విధంగా రుణగ్రహీత ఎకౌంట్ [illegible] తేదీ 29-08-2023 మ॥12:00 గం నుండి మ॥03:00 గం.ల వరకు https://egold.auctiontiger.net ద్వారా ఆన్‌లైన్‌లో వేలం నిర్వహించబడును.

క్ర. సం.	బంగారు రుణ ఖాతా నెం.	పేరు	తనఖా పెట్టిన తేదీ	తనఖా బంగారం బరువు (మొత్తం బరువు గ్రాముల్లో)	బంగారు రుణం మొత్తం
1	0959653000001952	[illegible]	24-01-2023	15.00	48000/-
2	0959653000001953	[illegible]	24-01-2023	5.6	18000/-

మరింత సమాచారం కొరకు దయచేసి ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఆక్షన్‌టైగర్)ను 6352632323/9023724780 పై సంప్రదించగలరు.

సం/- మేనేజర్, ది సౌత్ ఇండియన్ బ్యాంక్ లిమిటెడ్

విశాలాంధ్ర
➡ విశాఖపట్నం
➡ అనకాపల్లి
➡ అల్లూరి సీతారామరాజు

అగనంపూడి టోల్ గేట్‌ను తొలగించాలి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ ఎంపి ఎంవీవీ సత్యనారాయణను సీపీఎం 78వ వార్డు కార్పొరేటర్ డా. బి.గంగారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు ఆర్.వి.కుమార్‌తో కలిసి అగనంపూడి టోల్ గేట్‌ను వెంటనే తొలగించే చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాన్ని శుక్రవారం అందజేశారు. కాలం తీరిన టోల్ గేట్ ను తొలగించ కుండా ప్రజలను, వాహన దారులను నిలువ దోపిడీ చేస్తున్నదని తెలియజేశారు. అలాగే ఆనందపురం - సబ్బవరం - అనకాపల్లి ఆరు లైన్ల రోడ్డు నిర్మాణం పూర్తి అయిన వెంటనే ఆగనం పూడి టోల్ గేట్ తొలగిస్తామని సుప్రీం కోర్టులో నేషనల్ హైవే సమస్త హామీ ఇచ్చి ఉల్లంఘించిందని ఎంపి కి తెలియజేశారు.

జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా గంగాధర్ సూరిబాబు

విశాలాంధ్ర - కొయ్యూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా వైసీపీ జిల్లా కమిటీలో మండలానికి చెందిన ఎస్టీ సెల్ అధ్యక్షులు రీమల గంగాధర్, నీలాపు సూరిబాబులకు చోటు దక్కింది. పార్టీ జిల్లా కమిటీలో తమను ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎంపిక చేసిన అల్లూరి జిల్లా వైసీపీ అధ్యక్షురాలు పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి ఎంపీ మాధవి, కొయ్యూరు మండల వైసీపీ నేతలకు ప్రజాప్రతినిధులకు జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎంపికైన రీమల గంగాధర్ నీలాపు సూరిబాబులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకంతో పార్టీ జిల్లా కమిటీలో తమకు స్థానం కల్పించినందుకు సర్వదా పార్టీకి రుణపడి ఉంటామని అందరి సహకారం సమన్వయంతో పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

వైభవంగా వరలక్ష్మి దేవి వ్రతం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని వరలక్ష్మి దేవి వ్రతం ఘనంగా జరిగింది. శ్రావణమాసంలో శుక్రవారం జరిగే వరలక్ష్మీదేవి వ్రతాలను భక్తులు ఆచరిస్తారు. శుక్రవారం వ్రతం సందర్భంగా పలు గ్రామాల్లో అమ్మవారు ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. ఎస్. రాయవరం బుద్రేశ్వర స్వామి ఆలయంలో బాల త్రిపుర సుందరి అమ్మవారి వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు.

సిడబ్ల్యుసి సభ్యులు పల్లంరాజుకు ఘన సన్మానం



విశాలాంధ్ర - పాయకరావుపేట: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యునిగా నియమితులైన కేంద్ర మాజీ మంత్రి ఎం.ఎం. పల్లంరాజు ను కాకినాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, పిసిసి డేలిగేట్ జగతా శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయ కమిటీ సభ్యులు మోర్త సింహాచలం, పట్టణ అధ్యక్షులు పొలవరపు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

27న గాజువాకలో చేనేత కార్మికుల గర్జన



విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఈ నెల 27న గాజువాకలో జరగనున్న ఆల్ ఇండియా వివర్స్ ఫెడరేషన్ చేనేతల ఆత్మీయ సమావేశానికి చేనేత కార్మికులు పద్మశాలి కులస్తులంతా తరలి రావాలని జాతీయ అధ్యక్షుడు బండారు ఆనంద ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం శంకర మఠం, వద్ద గల పద్మశాలి భవనం లో ఏర్పాటు చేసిన సమావేశంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అఖల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ రానున్న రోజుల్లో, అందరం కలిసి కట్టుగా ఉండి రాజ్యాధికారం కోరకు పోరడాలని, చేనేత కార్మికుల సమస్యలపై పద్మశాలి కులస్తులంతా భవిష్యత్తులో మరింత ఐక్యమత్యంతో ముందుకు పోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు యలమంచిలి శివ రామప్రసాద్, జిల్లా అధ్యక్షులు వానపల్లి శ్వరరావు, భవనం పెద్దలు సన్యాసిరావు, వెంకటేశ్వర్లు, సంఘం పెద్దలు, వానపల్లి సత్య, సిరిబాబు, వి.సత్యన్నారాయణ, ఎన్.రవి, వెంకట్, నాగరాజు, ఫని కుమారి, తదితరులు పాల్గొన్నారు.

"బలిగెడ్డ"లో బీటలు వాలిన రోడ్డు

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: మండలంలోని బలిగడ్డ తారు రోడ్డు బీటలు వాలిందని ఫలితంగా ఆ రహదారి గుండా రాకపోకలు సాగించే వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ అల్లూరి సీతారామరాజు జిల్లా ఇన్చార్జి మస్య సుజాత సల్మాన్ అన్నారు. మండల పరిధిలోని కిల్లోగుడా నుంచి సొవ్వ మీదుగా బలిగడ్డ తారు రోడ్డు పూర్తిగా బీటలు వాలిందన్నారు. ఈ రోడ్డు నిర్మాణం చేపట్టి నాలుగు నెలలు పూర్తికాకుండానే బీటలు వాలిందన్నారు. ఈ రోడ్డు దుస్థితిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ఆమె కోరారు.

డుంబ్రిగుడ హెచ్‌డబ్ల్యుఓపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర - డుంబ్రిగూడ: దుంబ్రిగుడ బాలుర పాఠశాల వసతి గృహంలో కొలువు ఉంటూ విద్యను అభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన రోజువారి మెనూ అమలులో నాణ్యత లోపించిన భోజనాలను అందిస్తూ ఇష్ట రాజ్యాంగ వ్యవహరిస్తున్న వసతి గృహ నిర్వాహకుడు హెచ్ డబ్ల్యు ఓ (వార్డెన్) వ్యవహార తీరుపై అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ పిఓకు ఫిర్యాదు చేయనున్నట్టు మండల ఎంపీపీ బాకా ఈశ్వరి, జెడ్‌పిటిసి సభ్యురాలు సిహెచ్ జానికమ్మలు తెలిపారు. గిరిజన విద్యా అభివృద్ధిని కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా కోట్లాది రూపాయలు వెచ్చిస్తుండడంతో పాటు నాణ్యతతో కూడిన రోజువారి భోజనాలను అందించాలన్న ప్రభుత్వ అధికార యంత్రాంగ నిబంధనలకు భిన్నంగా వ్యవహరించడం సరికాదన్నారు. దుంబ్రిగుడ బాలుర పాఠశాల వసతి గృహంలో సక్రమంగా మెనూ అమలు కావడం లేదని గత మూడు రోజులుగా వివిధ పత్రికల్లో శీర్షికలు ప్రచురితమవుతున్నప్పటికీ ఆ శాఖ మండల స్థాయి అధికారులు పాఠశాలను సందర్శించి విద్యార్థుల ద్వారా వివరాలను అడిగి తెలుసుకోకపోవడం సరికాదన్నారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా లక్ష్మయ్య

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: మండలంలోని కిల్లోగుడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పిఆర్‌టీయు ప్రధాన కార్యదర్శి శెట్టి అప్పలరాజు, ఎన్నికల పరిశీలకుడు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో పి ఆర్ టి యు నూతన కార్యవర్గ ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. దుంబ్రిగుడ మండల పిఆర్‌టియు అధ్యక్షుడిగా కమ్మిడి లక్ష్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకోగా ప్రధాన కార్యదర్శి జి.రాంప్రసాద్, అసోసియేట్ అధ్యక్షుడిగా శెట్టి రాజు, ఉపాధ్యక్షులుగా కే మధుసూదనరావు, గౌరవ అధ్యక్షులుగా వి.రాము, అలాగే మహిళా అధ్యక్షురాలిగా శెట్టి మహాలక్ష్మి, కార్యదర్శిగా పాటి సరోజిని, మండల కార్యదర్శిగా జి.కామరాజు, ఎం.అర్జునరావు, కోశాధికారిగా పి సింహాద్రి, ప్రధాన కార్యదర్శిగా పి.రమేష్, సిపిఎస్ మండల కన్వీనర్‌గా కే.నాగేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్లుగా మండ్యాగురు శ్రీనివాస్, కృష్ణ, సిహెచ్ మధుసూదన్‌రావులు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు.

రైతులకు రాజ్‌మా విత్తనాలు పంపిణీ

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరిలోని గిరిజన రైతులకు రాజ్ మా విత్తనాలను ఎంపీపీ శెట్టి నీలవేణిశుక్రవారం పంపిణీ చేశారు. స్థానిక సచివాలయం వద్ద సర్పంచ్ సోమెల రూతు, జడ్పిటిసి సభ్యులు దీసరి గంగరాజు లతో కలిసి గిరి రైతులకు 90 శాతం సబ్సిడీపై రాజ్మా విత్తనాలను అందజేశారు. విత్తనాలను 250 రూపాయలకు మాత్రమే అందజేశారు .రైతులు వీటిని సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడి సాధించే విధంగా వ్యవసాయం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ దీప్తి సచివాలయ సిబ్బంది గ్రామ వాలంటీర్లు మాణిక్యం, సునీత ,బాకాసునిత స్థానిక నాయకులు సోమల నాగులు తదితరులు పాల్గొన్నారు.

ట్రక్కు ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం చేరుకుంపాలెం జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం బోలేరో వాహనం ఢీకొని కూసి మణికుమార్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. జడ్డంగి ఎస్ఐ టి.రఘునాథారావు తెలిపిన వివరాల ప్రకారం గంగవరం మండలం పిడతమామిడి గ్రామానికి చెందిన పోలోజు కుమారి అను ఉపాధ్యాయురాలు ఆమె పని చేస్తున్న సింగంపల్లి ఆశ్రమ పాఠశాలకు వచ్చేందుకు భర్తతో సహా చేరుకుంపాలెం జంక్షన్ వద్ద బస్సు కోసం ఎదురు చూస్తున్నారని, అటుగా వస్తున్న బొలేరో వాహనం అదుపు తప్పి రోడ్డుప్రక్కనున్న మణికుమార్‌ను ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. అతను భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు లింగంపేట నూకాలమ్మ అమ్మవారికి కిరీటం బహుకరణ

విశాలాంధ్ర - గొలుగొండ: మండలంలో లింగంపేట గ్రామంలో నిర్మించిన నూకాలమ్మ పోతురాజు బాబు నూతనంగా నిర్మించిన విషయం తెలిసిందే. అయితే ఇరువురికి గొలుగొండ కుంచం కుటుంబీకులు ఐదు లక్షల రూపాయలతో కిరీటాన్ని బహుకరించేందుకు కసింకోట సిద్ధాంతి రేజేటి రామాచార్యులు ముహూర్తం నిర్ణయించారని ఆలయ కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమం శనివారం ఉదయం 8 గంటల నుండి వినాయక పూజతో ప్రారంభమవుతుందని 11 గంటల 11 నిమిషాలకు వేదమంత్రాలతో అమ్మవారికి కిరీటం అలంకరించుట జరుగుతుందని ఈ మహెూత్సవ కార్యక్రమానికి భక్తులందరూ తరలి రావాలని ఆలయ కమిటీ నిర్వాహకులు ఈ సందర్భంగా కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం ఆత్మహత్య

విశాలాంధ్ర - పెందుర్తి: విశాఖ జిల్లా పెందుర్తి మండలం గొరపల్లిలో దారుణం చోటు చేసుకుంది. మండలంలోని గొరపల్లి గ్రామంలో సంతోష్ కుమార్ అనే వ్యక్తి అప్పుల పాలయ్యాడు. దీంతో అప్పులు తీర్చలేక, సంతోష్ కుమార్ తల్లి, తండ్రి, సోదరిఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గత రాత్రి 11 గంటలకు సంతోష్ ఇంటికి చేరి చూసే సరికి తల్లిదండ్రులు, సోదరి అపస్మారక స్థితిలో ఉన్నారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని ముగ్గురిని కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం తండ్రి కల్లూరి సత్యనారాయణ(51) మధ్యాహ్నం తల్లి సూర్యకుమారి(45) మృతి చెందారు. సోదరి నీలిమ (21) పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసిన పెందుర్తి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జీవీఎంసీ పార్కుల్లో అక్రమ నిర్మాణాలను తొలగించాలి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: 22వ వార్డు పరిధిలో గల పిఠాపురం కాలనీలోని కళాభారతికి అనుకోని ఉద్యానవనం (పార్కు) పీతలవానిపాలెం ఉడా కాలనీలో ఉద్యానవనం (పార్క్) స్థానిక ప్రజా ప్రయోజనాలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ శుక్రవారం స్పందనలో చీఫ్ సిటీ ప్లానర్ సునీతకు ఫిర్యాదు చేశారు. రెండు ఉద్యానవనంలలో వ్యాపారాల కోసం నిర్మించిన అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్థానిక ప్రజల కోసం జీవీఎంసీ నిధులతో నిర్మించిన ఉద్యానవనం (పార్క్)లు స్థానిక ప్రజలకు ప్రజా ప్రయోజనాలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడకుండా, అందులో కొంత భాగాన్ని టైలరింగ్ దుకాణం కోసం నిర్మించారని, దానిని కూడా ఇతరులకు అద్దెకి ఇచ్చి వ్యాపార అవసరాల కోసం వాడుకుంటున్నారన్నారు. అలాగే పీతలవానిపాలెం ఉడా కాలనీలో ఉద్యానవనం (పార్క్)లో కూడా ప్రైవేట్ వ్యక్తులు అనధికారంగా ఒక భవనం (జీ ం1) నిర్మించి క్రింద కిరణా దుకాణంతో పాటు మొదటి అంతస్తులో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్నారని తెలిపారు. అందుకోసం వేల రూపాయలలో కొన్ని ఏళ్ళ పాటు అక్రమంగా అద్దెలు వసూలు చేస్తూ జీవీఎంసీ ఆదాయానికి గండి కొడుతున్నారని తెలిపారు. రెండు ఉద్యానవనంలలో వ్యాపారాలకు లక్షలలో అద్దెలు వసూలుచేసినవి తిరిగి జీవీఎంసీకి చెల్లించేలా వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

డ్రాపౌట్స్‌ను పాఠశాలల్లో చేర్పించాలి

విశాలాంధ్ర - పెదబయలు: డ్రాప్ అవుట్ లాంగ్ ఆబ్సెంట్ ఉన్న విద్యార్థులను వారం రోజులలో పాఠశాలలో చేర్పించాలని స్థానిక ఎంపీడీవో ఎల్ పూర్ణయ్య ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎడ్యుకేషన్ సర్వే కి సంబంధించి అలాగే డ్రాప్ ఔట్ విద్యార్థులకి సంబంధించి గ్రామ వాలంటీర్ల వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఎంఈఓ, ఏపీడబ్ల్యుఓతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో పూర్ణయ్య మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో ఉన్నటువంటి ఐదు నుండి 18 సంవత్సరాల లోపు ఉన్న విద్యార్థుల యొక్క సమాచారాన్ని ప్రతి గ్రామ వాలంటీర్ ఇంటింటా సర్వే నిర్వహించి మూడు దినములలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

అదేవిధంగా ప్రతి పాఠశాలలో ఉన్నటువంటి డ్రాప్ ఔట్ విద్యార్థులు, లాంగ్ ఆబ్సెంట్ విద్యార్థులకు సంబంధించి ప్రతి గ్రామంలో సంబంధిత వెల్ఫేర్ అసిస్టెంట్ వారితో కలిసి సర్వే కొరకు ఇచ్చిన పట్టికలో ఇంటింటికి సర్వే చేసి ఏదైనా విద్యార్థులు డ్రాప్ అవుట్‌గా లేదా లాంగ్ ఆబ్సెంట్గా ఉంటే వారిని గుర్తించి వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించుటకు వారం దినము లలోగా ప్రక్రియను పూర్తి చేయవలసిందిగా ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కే.కృష్ణమూర్తి, మరొక మండల విద్యాశాఖ అధికారి జి పుష్ప, అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ స్వర్ణలత, వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 10న దళిత విముక్తి ఆధ్వర్యంలో ప్రతిఘటనా సదస్సు

విశాలాంధ్ర - చోడవరం: దళిత విముక్తి 25 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం నేపథ్యంలో సెప్టెంబర్ 10న ప్రతిఘటనా సదస్సు -ఊరేగింపులను జరపనున్నామని రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ తెలిపారు .ఈ మేరకు శుక్రవారం చోడవరం అంబేద్కర్ విగ్రహం వద్ద కార్యక్రమ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలోని ఆర్ అండ్ బి దగ్గర గల అంబేద్కర్ భవన్ లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు ప్రతిఘటనా సదస్సు, సాయంత్రం 4 గంటలకు సభా స్థలం నుండి ఎన్ఏడి కొత్త రోడ్డు వరకు ఊరేగింపు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమానికి వక్తలుగా మాజీ యూపీఎస్సీ సభ్యుడు, పూర్వ ద్రావిడ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.ఎస్.చలం, ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.డి. సత్యపాల్, తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడు అంబాటి నాగయ్య తదితరులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు జిల్లాల నుండి దళిత, బహుజనులు తరలిరాబోతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 28 ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సంక్షేమ పథకాలను రద్దు చేయడం దారుణమని తక్షణమే వాటిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రజా చైతన్యం, ప్రతిఘటనతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి వెంకటరమణ, దళిత హక్కుల సమాఖ్య నాయకులు,దళిత విముక్తి ప్రతినిధులు బంకపల్లి అప్పారావు, బి. సన్యాసమ్మ, యు.శివ, కంకణాల శ్రీను, అనకాపల్లి దళిత నాయకులు, చోడవరం నాయకులు సంజీబ్, హుస్సేన్, బోదయ్య, ఈశ్వరి, శ్రీను,పవన్, నాగరాజు, దాసు, బసిర్, మోత, ఉగాది వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అనర్హులకు వార్డెన్, మెట్రిన్ బాధ్యతలు అప్పగించవద్దు

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల వసతి గృహాలలో డిప్యూటీ వార్డెన్/ మెట్రిన్, బాధ్యతలను ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నియమించాలని, అనర్హులకు ఆయా బాధ్యతలు అప్పగించవద్దని అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుడు కూడ బొంజు బాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఐటిడిఓ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతి గృహాలలో విద్యార్థిని, విద్యార్థులకు పోష్టిక ఆహారం అందించాలనే ముఖ్యలక్ష్యంతో ప్రభుత్వం ముందుకు పోతుంటే, గిరిజన సంక్షేమ హాస్టల్ వసతి గృహాలలో మాత్రం పాడేరు ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ డిడి ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల లో వార్డిన్ / మెట్రిన్ బాధ్యతలు దీనికి భిన్నంగా నియమాకాలు జరుగుతున్నాయి అని ఆరోపించారు. 2022/ 23 విద్యా సంవత్సరంలో మూడు నెలల డిప్యూటీ వార్డెన్ నియామకాల వలన గిరిజన సంక్షేమ ఆశ్రమ హాస్టల్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి, విద్యార్థులకు పౌష్టికాహారం అందించే దాంట్లో పూర్తిగా విఫలమైన పరిస్థితి కనిపించింది అన్నారు. డిప్యూటీ వార్డెన్ , మెట్రిన్ గా నియామకాల కు సంబంధించి పూర్తిగా నిబంధన ఉల్లంఘన జరుగుతున్నాయని, పాడేరు ఐటీడీఏ గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ తాను అనుకున్న వారిని ఇష్టానుసారం నియమిస్తున్నారని ఆరోపించారు. తగు చర్యలు తీసుకొని సమస్యను చక్కదిద్దాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమైక్య అల్లూరి జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కార్డులు నమోదు చేయించండి మహాప్రభు....

విశాలాంధ్ర - చింతపల్లి: ఆధార్ కార్డులు లేక, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్న మారుమూల గిరి గ్రామాలలోని అమాయక గిరిజనులు, పి వి టి జి తెగకు చెందిన గిరిజనులకు ఆధార్ కార్డుల నమోదు తో పాటు, సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అందజేసి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా సంబంధిత ఉన్నత అధికారులు కృషి చేయాలని ఎర్ర బొమ్మల సర్పంచ్ ఎల్ పండయ్య, సిపిఐ పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యుడు సెగ్గే సత్తిబాబు లు అన్నారు. ఎర్రబొమ్మల పంచాయతీ ఎర్రబంద గ్రామంలో శుక్రవారం ఆ పంచాయతీకి చెందిన ఆధార్ కార్డులు, సంబంధిత ధ్రువీకరణ పత్రాలు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు అవకాశం లేని గిరిజనులు సర్పంచ్, ఎంపీటీసీలకు సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పండయ్య, ఎంపీటీసీ సభ్యుడు సత్తిబాబు లు మాట్లాడుతూ పంచాయతీలోని తప్పలమామిడి, జర్రగెడ్డ తదితర గ్రామాలతో పాటు మరిన్ని మారుమూల గ్రామాలలో ఎంతోమంది పివిటిజీ తెగకు చెందిన అమాయక గిరిజనులు నేటికీ ఆధార్ కార్డు లేకుండా ఉన్నారన్నారు. అటువంటి ఎంతోమంది ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత పొందలేకపోతున్నారని, వారిని గుర్తించి ఆధార్ కార్డు నమోదుకు, అదే క్రమంలో మిగిలిన ధ్రువీకరణ పత్రాలు మంజూరుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

వివాహిత ఆత్మహత్య

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖలో గత రెండు రోజులుగా వివాహిత మహిళల ఆత్మహత్యలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. గురువారం రాత్రి మిదులాపురి వుడా కాలనీలో వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య చేసుకోగా, శుక్రవారం ఉదయం మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత అనుమానస్పదంగా మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చింది. అటు పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఓ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడింది. పేద వాల్తేరు పోలమాంబ ఆలయం పక్కన గల ఎల్ ఐ సీ క్వార్టర్స్ లో ఎల్ కళావతి (35), భర్త, ఇద్దరు పిల్లలతో నివాసముంటుంది. కళావతి శుక్రవారం తెల్లవారుజామున తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో చికిత్స నిమిత్తం బంధువులు సమీపం లోని ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఉదయం 7గంటల సమయంలో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు చెప్తున్నారు. కళావతి భర్త పైనే బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భర్తే హత్య చేసి ఉంటాడని వారంతా చెప్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజిహెచ్ మార్చురికి తరలించారు. బాధితురాలు కళావతి మృతికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఎస్సై రాము నేతృతంలో మూడవ పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాముగండి సర్పంచ్ మృతి

విశాలాంధ్ర - దేవీపట్నం: మండలంలో పాముగండి గ్రామపంచాయతీ సర్పంచ్‌గా విధులు నిర్వహిస్తున్న కోసు బుచ్చన్న దొరకు గత కొంత కాలంగా అనారోగ్యానికి గురై రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు వైద్యం పొందుతూ గురువారం అర్ధరాత్రి అకాల మరణం చెందారు. ఆయన మరణంతో గ్రామంలోను, కుటుంబంలోను తీరని విషాదం నెలకొంది. పార్థివదేహాన్ని పలువురు వైసీపీ నాయకులు సందర్శించి ఘన నివాళి అర్పించారు. శరభవరం ఎంపిటిసి సభ్యుడు తుర్రం జగదీశ్ దొర, ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, మెంబర్ సోదే ఉదయ్ కిరణ్ దొర, గ్రామపంచాయతీ సర్పంచ్ మిర్తి వాడ పోసి రత్నారెడ్డి, ఎంపీటీసీ కర్రి అబ్బాయి రెడ్డి, చొప్ప కొండ గ్రామపంచాయతీ సర్పంచ్ కర్రి చిన్నబుల్లాబ్బాయి రెడ్డి, సోముల శిరీష, శివరామకృష్ణ దొర, రాజన్న దొర, వైస్ ఎంపీపీ కలుం స్వామి దొర, కృష్ణారెడ్డి, శ్రీను, దేవీ రెడ్డిలు నివాళులర్పించారు.

ఘనంగా వరలక్ష్మి వ్రతం

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండల కేంద్రంతో పాటు మండల పరిధిలో గల సుజన కోట, మినుముల పుట్టు, కించాయి పుట్టు, కిలగాడా, దారెల, కొత్త సృజన కోటలతోపాటు మండల పరిధిలో పలు గ్రామాల్లో శ్రావణ శుక్రవారం పర్వదినాన్ని పురస్కరించుకుని మహిళలంతా భక్తి శ్రద్ధాలతో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వారి గృహంలో వరలక్ష్మీ వ్రతం చేసేందుకు కలశం తో అమ్మవారి ఫోటోలు ప్రతిమలు ఉంచి మండపాలను ఎంతో ఆకర్షణీయంగా అలంకరించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండల కేంద్రం ఎస్.రాయవరంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని స్థానిక లైన్ మేన్ వాసు తెలిపారు. శనివారం 8 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు గ్రామంలోని విద్యుత్ వైర్లు సంబంధించి చెట్టుకొమ్మలు లేకుండా పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. దీనిని వినియోగదారులు గమనించి సహకరించాలని అభ్యర్థించారు.

50 వేల కోట్లు దాటిన బజాజ్ ఫైనాన్స్ ఫిక్సిడ్ డిపాజిట్లు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారతదేశంలో అగ్రశ్రేణి వైవిధ్యభరితమైన నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల్లో ఒకటైన బజాజ్ ఫిన్‌సర్వ్ లో భాగమైన బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ తమ ఫిక్స్ డ్ డిపాజిట్ల ఖాతా రూ. 50,000 కోట్ల మైలురాయిని దాటినట్టు బజాజ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఫిక్స్ డ్ డిపాజిట్స్, ఏఎంపి, ఇన్వెస్ట్ మెంట్స్ సచిన్ సిక్కా తెలిపారు. బజాజ్ ఫైనాన్స్ కు అయిదు లక్షల మందికి పైగావినియోగదారులు ఉన్నారన్నారు. ప్రతి డిపాజిటర్ 2.87 డిపాజిట్లను, మొత్తంగా 14 లక్షల డిపాజిట్లను కలిగి ఉన్నామన్నారు. క్రిసిల్, ఐసిఆర్ఎ, కేర్, ఇండియన్ రేటింగ్స్ ద్వారా తమ దీర్ఘకాలిక రుణ కార్యక్రమం నిమిత్తం అత్యున్నతమైన ఏఏఏ/ స్టేబుల్ క్రెడిట్ రేటింగ్‌ను బజాజ్ ఫైనాన్స్ కలిగి ఉందన్నారు. క్రిసిల్, ఐసిఆర్ఎ, కేర్, ఇండియన్ రేటింగ్స్ ద్వారా తమ స్వల్ప కాలిక రుణ కార్యక్రమం నిమిత్తం ఏ1ంను, క్రిసిల్, ఐసిఆర్ఎల నుంచి తమ ఫిక్స్ డ్ డిపాజిట్స్ కార్యక్రమం నిమిత్తం ఏఏఏ(స్టేబుల్) రేటింగ్ ను కలిగి ఉందన్నారు.

దుర్గాలమ్మ ఆలయంలో వరలక్ష్మీ వ్రతం వేడుకలు

విశలాంధ్ర - కొమ్మది: మధురవాడ చంద్రంపాలెం జాతర గట్టు మీద కొలువైవున్న శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయంలో ఈరోజు శోభకృత్ నామ సంవత్సరం వర్ష ఋతువు శ్రావణ మాసం శుక్ల పక్షం తిథి నవమి శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా అమ్మవారికి నిత్యార్చనతో పూజలు ప్రారంభించి, ప్రత్యేక కుంకుమార్చన, పుష్పార్చన, మొదలగు పూజ కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు, పట్నాల సుబ్బారావు శర్మ, పట్నాల హరి ప్రసాద్ శర్మ, పట్నాల మూర్తి శర్మ, హరి స్వామి, శంకర్ స్వామి తదితరులు జరిపించారు. మధురవాడ చంద్రంపాలెం వాస్తవ్యులు పి.వి.జి.అప్పారావు, యశోద దంపతులు వారి కుటుంబ సభ్యులు ఆర్థిక సహాయం ఏర్పాటు చేసిన పులిహెూర ప్రసాదమును భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, శ్రీ దుర్గాలమ్మ ఆలయ నిర్వాహకులు పిళ్లా సూరిబాబు, పి.వి.జి.అప్పారావు, నాగోతి తాతారావు, పిళ్లా శ్రీనివాసరావు, పిళ్లా వెంకటరమణ, పోతిన పైడిరాజు, పిళ్లా రమణ, యస్. రాంబాబు, పిళ్లా మోహన్ శివ కృష్ణ, కేశనకుర్తి అప్పారావు, డి.సోంబాబు, బంక వాసు, పొట్నూరి హరికృష్ణ, పిళ్లా సన్యాసిరావు, దుక్క వరం, గ్రామ పెద్దలు పీస రామారావు, జగుపిల్లి నాని, ముఖ్య సభ్యులు పిళ్లా పోతరాజు, పిళ్లా అప్పన్న, పి.వెంకటరమణ, జగుపిల్లి సురేష్, పిళ్లా రాజు, పిళ్లా సూరి పాత్రుడు, యమ్.వెంకటరావు, యస్.శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

శనివారం 26, ఆగస్టు, 2023

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం శంకుస్థాపనలో ఎంపీ మాధవి

విశాలాంధ్ర – కొయ్యూరు: 834 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం జగన్మోహన్ రెడ్డి కేంద్ర విద్యా నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లతో ఎంపీ మాధవి పాల్గొన్నారు. విజయనగరం జిల్లా మెంటాడ దత్తిరాజేరు మండలాల్లో 561.8 ఎకరాల్లో 834 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయనున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ మాధవి సీఎం జగన్ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం సీఎం కేంద్ర మంత్రులకు ఎంపీ మాధవి జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర విద్యాశాఖ

మంత్రి బొత్స సత్యనారాయణ పలువురు ఎంపీలు ఎమ్మెల్సీలు ఎమ్మెల్యేలు జడ్పీ చైర్ పర్సన్ లు వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మౌన దీక్ష

విశాలాంధ్ర – ఆనందపురం: ఆధ్యాత్మిక పేరు కలిగిన లక్ష్మీ నరసింహ స్వామి పాదముద్రికలు ఎన్నో వేళ్ళనాటి దేవుడు కొండగా పిలవబడే చుక్కకొండను అధికార దాహంతో వైసిపి నాయకులు విజయసాయిరెడ్డి, చేజిక్కించుకోవాలని చూస్తున్నారని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీ శ్రీనివాస నంద స్వామి, విశ్వహిందూ పరిషత్ పీఠాధిపతులు గ్రామ ప్రజలు ఆధ్వర్యంలో ఆనందపురం మండలంలో ఉన్న తర్లువాడ సర్వే నెంబర్ 1 చుక్క కొండను పరిశీలించిన మీదట క్రింద వినాయక దేవాలయం గ్రామ ప్రజలతో మౌన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్మాత్మకంగా ఉండే కొండను అభివృద్ధి అనే పేరు పెట్టి నాశనం చేయడానికి పూనుకున్నారని, అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం క్షేత్రంలో చైర్మన్ పదవిని ఒక నాస్తికుడికి కట్టబెట్టారని హిందు ధర్మాన్ని నాశనం చేస్తున్నారని హిందువుల మనోభావాలతో పాటు ఆశ్రమాలు, కొండలు, దేవాలయాలు, క్షేత్రాలను, నాశనం చేసే పనిలో భాగంగా కొన్ని వేల సంవత్సరాల నుండి దేవుడు పాదాలు కలిగి ఉన్న ఆధ్యాత్మికమైన కొండను నాశనం చేయడం చాలా దారుణం అని అందులో భాగంగా శుక్రవారం చుక్క కొండ వద్ద గ్రామ ప్రజలతో మౌన దీక్ష కార్యక్రమం చేపట్టామని ఈ దేవుడు కొండ జోలికొస్తే ఏ నాయకుడినైనా తరిమి తరిమి కొడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీనివాస నంద స్వామీజీ, కరుణానంద స్వామీజీ, సభ్యులు రామానంద స్వామీజీ, వేణుగోపాల స్వామీజీ, త్రినాథ్ స్వామీజీ ,రామచంద్ర విరాట్, హిందూ సంఘ అధ్యక్షులు ఏడూ ఫణీంద్ర, హిందూ సంఘ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బాల్యవివాహం అడ్డగింత

విశాలాంధ్ర – మాకవరపాలెం: బాల్యవివాహాన్ని ఐసిడిఎస్ అధికారులు అడ్డుకున్నారు. మండలంలోని రామన్నపాలెం గ్రామంలో మైనర్ వివాహం జరుగుతున్న విషయం తెలుసుకున్న నర్సీపట్నం సిడిపిఓ మేరీ సువార్త, సూపర్వైజర్లు, పోలీసులు శుక్రవారం అక్కడకు చేరుకున్నారు. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. బాలికకు వివాహం చేయడం వల్ల జరిగే అనార్ధలను వివరించారు. నిబంధనలకు విరుద్దంగా వివాహం చేస్తే కేసులు తప్పవని తెలిపారు.

నేడు ఉచిత ఊపిరితిత్తుల వైద్య శిబిరం

విశాలాంధ్ర – చోడవరం: చోడవరం న్యూ శేషానందం మందుల దుకాణం ఆవరణలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుండి 5 గంటల వరకు ఉచిత ఊపిరితిత్తుల వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో రూ.800 విలువ గల ఊపిరితిత్తుల (పి.ఎఫ్.టి) పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. అలాగే ఆస్థమా, ఎలర్జీ, దగ్గు, జ్వరం, న్యూమోనియా, క్షయ, థైరాయిడ్, డయాబెటిస్, మొదలైన ఆరోగ్య సమస్యల పై విశాఖ ఎన్.ఆర్.ఐ. ఆసుపత్రి ప్రముఖ వైద్యులు కొణతాల సురేంద్ర వైద్య సేవలు అందిస్తారని తెలియజేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం నిరసన

విశాలాంధ్ర – గొలుగొండ: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 4 వరకు నిరసన ర్యాలీలు నిర్వహించనున్నట్లు సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు

అడిగర్ల రాజు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండలంలో జోగంపేట సెంటర్లో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా అడిగర్ల రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బిజెపి విధానాలు ప్రజలకు గుదిబండగా మారుతున్నాయి అన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే రద్దు చేయాలని నిత్యవసర వస్తువులు అధిక ధరలు తగ్గించాలని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. అలాగే ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయరాదని గ్రామీణ ఉపాధి నిధులు పెంచాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సోమనాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలన్నారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు సాయిపరెడ్డి నారాయణమూర్తి మాట్లాడుతూ మండలంలో వివిధ ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న గిరిజనకు రైతులకు సాగు నమోదు చేసి సాగులో ఉన్న గిరిజన రైతులు పేరును పట్టాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు భూమిపూజ

విశాలాంధ్ర – హుకుంపేట: బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుతో ఆన్లైన్ ఇబ్బందులు తీరుతాయని సర్పంచు సమిడ వెంకటపూర్ణిమ పేర్కొన్నారు. మండలంలో దిగుడుపుట్టు గ్రామంలో శుక్రవారం సర్పంచు టవర్ ఏర్పాటుకు శంకుస్థాపన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆన్లైన్ సేవలు పొందాలన్నా ప్రతి నెల బియ్యం తీసుకోవాలన్నా దిగుడుపుట్టుతో పాటు చుట్టు పక్కల ప్రజలు మండల కేంద్రం కానీ లేక కొండపైకి వెళ్లి ఆన్లైన్ సేవలు వినియోగించుకొనే వారని నేడు బిఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణంతో ప్రతి ఇబ్బంది తొలగుతుందని తెలిపారు. ప్రభుత్వం అందించే పథకాలు తెలుసుకోనేందుకు, నిరుద్యోగ యువతకు నెట్ సౌకర్యం లేకపోవటంతో ఉద్యోగావకాశాలకు దూరంగా ఉండిపోయారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు అనీల్, సూరిబాబు, మీనా, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గారు..... ఏజెన్సీని ఏమి చేయదల్చుకున్నారు..?

విశాలాంధ్ర – సీలేరు: ఎమ్మెల్యే గారు...ఏజెన్సీని ఏమి చేయదల్చుకున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మిని ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఏసి రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అధికార వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వార్డు మెంబర్ జీఓ 3 రద్దు గురించి పాడేరు ఎమ్మెల్యేని ప్రశ్నించడంతో ఎమ్మెల్యే అసహనంతో వార్డు మెంబర్ని అజ్ఞాని అని, జీఓ 3 కోసం మాట్లాడేవారికి ఏమి తెలియదన్నట్లు మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తూ, జీఓ 3 సుప్రీంకోర్టు రద్దు చేసినప్పటికి ప్రభుత్వానిదే బాధ్యతగా భావించాలి కానీ ఎమ్మెల్యే ప్రభుత్వానిది తప్పులేదంటున్నారని, జీఓ 3 కోసం సుప్రీంకోర్టులో వేసిన రివ్యూ పిటిషన్ మీద వాదనలు జరుగుతుండగా గిరిజన సంక్షేమ అధికారులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం నోటిఫికేషన్లు ఇవ్వడం,అందులో ఆదివాసిలకు ఉద్యోగాలు లేకుండా చేయడం ఎమ్మెల్యేకు కనిపించకపోవడం దురదృష్టకరమన్నారు. జీఓ 3 ఎవరు రద్దు చేసిన నష్టం ఆదివాసిలకే జరిగింది కానీ అదివాసీలకు నాయకత్వం వహించే ఎమ్మెల్యే, ఎంపీలు తమకు పట్టనట్లు వ్యవహరించడం వల్లనే అదే పార్టీకి చెందిన వార్డు మెంబర్ నిర్మోగమాటంగా ఎమ్మెల్యేను నిలదీయడం విశేషమన్నారు. వార్డు మెంబరే కాదు భవిష్యత్తులో అందరు ప్రశ్నించే పరిస్థితి వస్తుందని, బోయ వాల్మీకులను గిరిజన జాబితాలో కలపాలనే అసెంబ్లీ తీర్మానాన్ని ఎందుకు

వ్యతిరేకించలేదన్నారు. షెడ్యూల్డ్ ఏరియాలో గిరిజనేతరులకు ఒకటిన్నర సెంట్ల భూమి ఇవ్వాలని ఆదివాసి ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి లేఖ రాయడం, పీసా చట్టానికి వ్యతిరేకంగా హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణం చేయడానికి ఎమ్మెల్యేగా ఎందుకు వ్యతిరేకించలేదన్నారు. ఇలాంటి విషయాలన్నింటి మీద ఎమ్మెల్యేలను ప్రశ్నించే పరిస్థితి త్వరలోనే వస్తుందని, తప్పించుకోవడానికి తంటాలు పడవలసిన సమయం అసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఏసి జికె వీధి మండల కన్వీనర్ కొర్ర బలరాం, కోకన్వీనర్లు కొర్ర నీలకంఠం, గెమ్మెల పరమేష్, ప్రధాన కార్యదర్శి బత్తుల సిద్దార్థ మార్క్, సోషల్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రీమెల పాల్ తదితరులు పాల్గొన్నారు.

మున్నాళ్ళ ముచ్చటగా మూడు నెలల డిప్యూటీ వార్డెన్ విధానం

గడువు పూర్తయినా కొనసాగుతున్న వార్డెన్లు
ఆశ్రమాల్లో అమలు కాని మెనూ

విశాలాంధ్ర – హుకుంపేట: గిరిజన ఆశ్రమ పాఠశాల వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన పౌష్టికాహారం అందించడంతోపాటు సబ్జెక్టుల్లో విద్యార్థులు నష్టపోకుండా ఉండేందుకుగాను గత ఐటీడీఏ పీఓ రోణంకి గోపాలకృష్ణ మూడు నెలల డిప్యూటీ వార్డెన్ షిప్ విధానాన్ని తీసుకొచ్చారు. దీంతో గత ఏడాది విద్యా సంవత్సరం నుంచి ప్రతి మూడు నెలలకు ఆ పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయుల్లో ఒకరిని డిప్యూటీ వార్డెన్ గా బాధ్యతలు అప్పగిస్తున్నారు. గతంలో ఆ పాఠశాలల్లోని ఎస్జీటీ, పిటి,పిడి ఉపాధ్యాయులను డిప్యూటీ వార్డెన్లుగా నియమించే వారు. కానీ కొన్నేళ్లుగా స్కూల్ అసిస్టెంట్లను కూడా డిప్యూటీ వార్డెన్లుగా బాధ్యతలు అప్పగించడం వల్ల విద్యార్థులు ఆయా సబ్జెక్టుల్లో నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని అప్పటి ఐటీడీఏ పీఓ గోపాలకృష్ణ మూడు నెలల విధానంను తీసుకొచ్చారు. వార్డెన్ గా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులు పూర్తిగా విద్యా ర్థులకు భోజన సదుపాయాలతో పాటు ఇతర పాఠశాల పనులు చేపట్టడంలో నిమగ్నమవుతారు. దానివల్ల వారి వారి సబ్జెక్టులను బోధించడానికి సమయం కేటాయింపుల్లో కష్ట సాధ్యం కావడం వల్ల విద్యార్థులు సబ్జెక్టులో నష్టపోవాల్సి వస్తుంది.

స్కూల్ అసిస్టెంట్లను వంటింట్లో నియమించిన సబ్జెక్టులు విద్యార్థులు నష్టపోకుండా ఉండాలన్న ఉద్దేశంతో మూడు నెలల విధానంను అమలు చేశారు. అయితే ఆ విధానాన్ని ప్రస్తుతం స్థానిక హుకుంపేట మండలంలోని ఆశ్రమ పాఠశాలల్లో ఎక్కడ కూడా అమలు కావడం లేదు. గత యేడాది పాఠశాలల్లో గత ఫిబ్రవరిలో బాధ్యతలు చేపట్టిన డిప్యూటీ వార్డెన్లు ఇప్పటివరకు సుమారు ఐదు, ఆరు మాసాలు గడుస్తున్న కొనసాగుతున్నారు. విద్యార్థులకు పెట్టాల్సిన భోజనం మెనూ సక్రమంగా అమలు పరచడం లేదనే ఆరోపణలు స్థానిక ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల నుంచి వస్తుంది.

భోజన మెనూ సక్రమంగా అమలు జరుగుతుందా !లేదా! అనే దానిపై ఎప్పటికప్పుడు పరిశీలించా ల్సిన సంబంధిత ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవ డంతో ఆశ్రమ పాఠశాల ప్రధానోఉపా ధ్యాయులు, డిప్యూటీ వార్డెన్లుగా కుమ్మక్కై యధావిధిగా కొనసాగించు కుంటూ లాభర్జనకు పాల్పడుతున్న ట్లు విమర్శలు వస్తున్నాయి. ఇప్పటి కైనా తక్షణ మే జిల్లాస్థా అధికారులు స్పందించి మూడు నెలలు గడువు పూర్తయిన డిప్యూటీ వార్డెన్ లను తొలగించి ఆయా స్థానంలో వేరే వారిని నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు ఉపాధ్యా యులు కోరుతున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు

మాకవరపాలెం ఎస్సై రామకృష్ణారావు

విశాలాంధ్ర – మాకవరపాలెం: విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని మాకవరపాలెం ఎస్సై రామకృష్ణారావు కోరారు. మాకవరపాలెం అవంతి కళాశాలలో పాలిటెక్నిక్ ద్వితీయ, తృతీయ సంవత్సరం చదివే విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై రామకృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు యాంటీ ర్యాగింగ్, రోడ్డు భద్రత నిబంధనలు, మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్‌కు పాల్పడి విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. ర్యాగింగ్ పాల్పడిన వాళ్లకు కళాశాల ప్రవేశం రద్దు చేయడం, రూ.2.5లక్షల జరిమానా, జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్‌ను విధిగా ధరించాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించి మీ ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. అనంతరం అవంతి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం యాంటీ ర్యాగింగ్ కొరకు కఠిన చట్టాలను తీసుకువచ్చిందన్నారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడి తమ బంగారు భవిష్యత్‌ను పాడుచేసుకోవద్దని కోరారు. అవంతి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.ప్రసాదరావు మాట్లాడుతూ పాలిటెక్నిక్ మొదటి సంవత్సరంలో చేరుతున్న విద్యార్థినీ విద్యార్థులను స్నేహపూర్వకంగా ఆహ్వానించి కలిసిమెలిసి ఉండాలని పాలిటెక్నిక్ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులను కోరారు. అనంతరం ఎస్సైను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, 400 మంది విద్యార్థులు, కళాశాల ఏఓ డానియల్ రాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మివ్రత పూజలు

విశాలాంధ్ర – వి.ఆర్.పురం: శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రెండో శుక్రవారం నాడు వరలక్ష్మీ వ్రతాన్ని జరుపుకుంటారు. మహిళలు దీర్ఘకాలం సుమంగళిగా ఉండేందుకు ఈ వ్రతం ఆచరించడం ఆనవాయితీ అంతేకాదు, సిరుల తల్లి లక్ష్మీదేవిని పూజించడం వల్ల అష్టైశ్వర్యాలు లభిస్తాయని హిందువుల నమ్మకం. అమ్మవారిని పూలతో అలంకరించి, నైవేద్యంగా బూరెలు, గారెలు, పులిహోర తదితర పిండి వంటలను అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు.

సంతోషిమాత మాలధారణ కార్యక్రమం ప్రారంభం

విశాలాంధ్ర – మాడుగుల: మాడుగుల మండలం కేజే.పురం జంక్షన్‌లో వేంచేసియున్న శ్రీసంతోషిమాత అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారి మాలధారణ కార్యక్రమం ప్రారంభమైంది. సుమారు 50 మంది భక్తులు అమ్మవారి దీక్షలు చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ళ అమ్మతల్లినాయుడు ఆధ్వర్యంలో ప్రతి ఏడాది కూడా భక్తులు అమ్మవారి దీక్షలు శ్రావణమాసంలో ప్రారంభిస్తారు. ఈ మండల దీక్షను శుక్రవారం నుంచి ప్రారంభించినట్టు అమ్మతల్లినాయుడు తెలిపారు.

బాలుడికి అంబేద్కర్ ట్రస్ట్ ఆర్థిక సహకారం

విశాలాంధ్ర – చోడవరం: మెదడుకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న చోడవరానికి చెందిన మెలిపాక హమాన్సిత్ (3)కు అంబేద్కర్ ట్రస్ట్ తరపున వారి తల్లితండ్రులకు శుక్రవారం రూ.25,000లు ఆర్థిక సహకారం అందించి, మానవత్వాన్ని చాటారు. మెలిపాక తారకేశ్వరరావు కుమారుడు హమాన్సిత్ మెదడుకు సంభందించిన వ్యాధితో బాధపడుతుండగా, ఆపరేషన్ చేయాలని వైద్యులు నిర్ధారించారన్నారు. ఈ ఆపరేషన్‌కు నాలుగు లక్షల రూపాయలు వరకు ఖర్చు అవుతుంది అని చెప్పడంతో, పేదరికంలో మగ్గుతున్న తారకేశ్వరారావు దాతలు కోసం ఎదురు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న ట్రస్ట్ సభ్యులు తమ దాతృత్వాన్ని చాటారు. ఈ

కార్యక్రమంలో నడుపూరి సన్యాసిరావు, విశ్రాంత అధ్యాపకుడు నడుపూరి దేముడు, న్యాయవాది యర్రంశెట్టి వరప్రసాద్, దొమ్మేశి గిరి, వేచలపు ప్రకాష్, విశ్రాంత ఉపాధ్యాయుడు జుంజూరు అప్పారావు, ఖండేల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

38వ నేత్రదాన పక్షోత్సవం ప్రారంభం

విశాలాంధ్ర – విశాఖ సిటీ: నగరంలోని ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ నేత్ర వైద్యశాల వద్ద 38వ జాతీయ నేత్రదాన పక్షోత్సవం ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఆగస్టు–25 నుంచి సెప్టెంబర్–8 వరకు 15 రోజులు పాటు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు చెప్పారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న మొహ్సెస్ నేత్ర నిధి (ఐ బ్యాంక్) అధినేత డాక్టర్ రోహిత్ దురేజా మాట్లాడుతూ నేత్రదానం చేయుటకు ప్రతి ఒక్కరు ప్రతిజ్ఞ చేయాలని, కార్నియల్ అంధత్వ నివారణకు సహకరించాలని ప్రజలకు సూచించారు. భారతదేశంలో 10 మిలియన్ల అందులలో 2 మిలియన్లు మంది కార్నియల్ అందత్వంతో బాధపడుతున్నారన్నారు. కార్నియల్ అంధత్వానికి కార్నియా మార్పిడి మాత్రమే సరియైన చికిత్స అని, అందువలన గణనీయంగా నేత్ర దానం. చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కాని మనదేశంలో నేత్రదానం పట్ల అపోహలు భయాలు ఉండటం వలన నేత్రదానం చేసే వారి సంఖ్య చాల తక్కువగా ఉందని నేత్రదానానికి అందరూ ముందుకు రావాలని కోరారు.

వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులుగా కందుల బ్రహ్మాజీ

విశాలాంధ్ర – దేవీపట్నం: జిల్లా వైసీపీ పార్టీ కార్యవర్గంలో అల్లూరి జిల్లా దేవీపట్నంకు సముచిత స్థానం లభించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా నూతన కార్యవర్గాన్ని తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. జిల్లా అధ్యక్షురాలుగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మిని కొనసాగిస్తూనే మరో 39 మంది సీనియర్ కార్యకర్తలకు, నాయకులకు నూతన కార్యవర్గంలో అవకాశం లభించింది. ఇందులో భాగంగా అల్లూరి జిల్లా వైయస్సార్సీపి జిల్లా ఉపాధ్యక్షులుగా కందుల బ్రహ్మాజీ (బాబ్జి)ని నియమించడం జరిగింది. అలాగే అల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా కట్టా సత్యనారాయణ (సత్తిబాబు)ని నియమించడం జరిగింది. అనంతరం కందుల బాబ్జి మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి పార్టీలో ప్రతీ కార్యకర్తకు, నాయకులకు కష్టాన్ని తగ్గ ప్రతిఫలం లభిస్తుందని అన్నారు.

సరైన ఆరోగ్యానికి పోషకాహార ప్రాధాన్యత పెరగాలి

విశాలాంధ్ర –విశాఖ సిటీ: సంపూర్ణ ఆరోగ్యం ఆరోగ్యం సాధించే దిశగా మనం తీసుకునే ఆహారంలో పోషకాహానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు ఆహార రంగ నిపుణులు సూచించారు. ఈ మేరకు జరిగిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ ఉత్సవాల సీజన్లో ఇచ్చిపుచ్చుకునే బహుమతులలో బాదములను ఎంపిక చేసుకోవాలన్నారు. ప్రియమైనవారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకున్న వేళ, మంచి ఆరోగ్యం కోసం కొన్ని బాదంపప్పులను బహుమతిగా ఇవ్వడం కంటే మెరుగైన మార్గం ఈ రక్షా బంధన్ వేళ మరొకటి లేదన్నారు.

బాదంలో ప్రోటీన్, ఫైబర్, మంచి కొవ్వులు, విటమిన్ ఈ, కాల్షియం, మెగ్నీషియం ఉన్నాయన్నారు. మొక్కల ఆధారిత ప్రోటీన్ యొక్క అద్భుతమైన మూలం, బాదం అని, ఒక వ్యక్తిని చాలా కాలం పాటు శక్తివంతంగా సంతృప్తిగా ఇవి ఉంచగలవన్నారు. సదస్సులో బాలీవుడ్ నటి సోహా అలీ ఖాన్ , డాక్టర్ రోహిణి పాటిల్, రితికా సమద్దర్ తదితరులు ప్రసంగించారు.

డోన్‌లో క్రిస్టియన్ కమ్యూనిటీ భవనం

విశాలాంధ్ర –విశాఖ సిటీ; ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ ను క్యాంపు కార్యాలయంలో నంద్యాల జిల్లా డోన్ క్రైస్తవ సమాఖ్య సభ్యులు కలవడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సిఫార్సు మేరకు డోన్ లో వైయస్సార్ క్రిస్టియన్ కమ్యూనిటీ భవన నిర్మాణం విషయమై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డోన్

క్రైస్తవ సమాఖ్య అధ్యక్షుడు రెవరెండ్ బందెల రాజు ఉపాధ్యక్షులు పి శామ్యూల్ , జనరల్ సెక్రెటరీ జి సాల్మన్ ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా శ్రీనివాసరావు, విజయలక్ష్మీ

విశాలాంధ్ర – మాడుగుల: వైసిపి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా మాడుగులకు చెందిన ఉప సర్పంచ్ శ్రీనాధు శ్రీనివాసరావు, ఎంపిటిసి పొలిమేర విజయలక్ష్మీలను నియమించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ తమకి ఈ పదవులు ఎంపిక చేసిన ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపుకు కృషి చేస్తామని తెలిపారు.